క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాపురం(ఎం): మండలంలోని జవహర్ నగర్ మోడల్‌స్కూల్‌లో అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో టీజీటీ హిందీ, పీజీటీ సివిక్స్, పీజీటీ కామర్స్, పీజీటీ ఫిజిక్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అర్హులైన అభ్యర్థులు ఈనెల 23న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాఠశాలకు రావాలన్నారు. ఇంటర్వ్యూ, డెమో ఆధారంగా అధ్యాపకుల నియామకం జరుగుతుందన్నారు.

మండల కమిటీ ఎన్నిక


భద్రయ్య, అధ్యక్షుడు


నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి

మంగపేట: పీఆర్‌టీయూ టీఎస్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని శనివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చందా భద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా మద్దెల నాగేశ్వర్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా చేరాల రాజేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా ఎస్ క్రాంతి, మహిళా ఉపాధ్యక్షురాలుగా మాధురీదేవి, ప్రధాన కార్యదర్శిగా పాయం వీరనారాయణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల పదవి విరమణ పొందిన భాస్కర్‌రావు, పదోన్నత పొందిన ఉపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వేంయాకూబ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేశవరావు, ఈసం అనసూర్య, గోవిందరావుపేట అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, వాజేడు ప్రధాన కార్యదర్శి దామోదర్, చింతా లక్ష్మీనారాయణ, మేనక, బాలాజీ, సత్యనారాయణ, శ్రీనివాస్, సారయ్య, సుధాకర్‌రావు, సాంబశివరావు, నర్సింగరావు, రాందాస్, లావణ్య, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కమిటీ..




మంగపేట: మండలంలోని రాజుపేటలో శ్రీ చైతన్య ఆటో యూనియన్ నూతన కమిటీ ఎన్నిక ఆటో యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు మైమూద్, నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కర్రి శ్రీను, ప్రధాన కార్యదర్శిగా చిట్యాల సాంబశివరావు, కోశాధికారిగా దీగొండ నవీన్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులను యూనియన్ సభ్యులు, డ్రైవర్లు శాలువాతో సత్కరించి సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



వాజేడు: మండల పరిధిలోని ఎర్రబోరు ప్రాంతంలో శనివారం ద్విచక్రవాహనం అదుపు తప్పి పల్టీ కొట్టడంతో జంగాలపల్లికి చెందని బొగ్గుల రాంబాబు, ఏటూరునాగారం మండలం రొయ్యూరుకు చెందిన పెరుమాండ్ల నీలాద్రి గాయపడ్డారు. వారిని స్థానికులు 108 ద్వారా వాజేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. నీలాద్రి వాజేడులోని తన మేమ ఇంటికి రాగా, రాంబాబుతో కలిసి కడెక్కల్ గ్రామానికి వెళ్తుండగా సంఘటన చోటుచేసుకుంది.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



మల్హర్: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎంపీడీఓ శ్యామ్‌సుందర్ అన్నారు. మండల కేంద్రం తాడిచర్ల స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మండల పరిషత్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా భవిష్యత్‌ను నిర్ధేశించుకొని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ విజయదేవి మాట్లాడుతూ.. విద్యార్థులందరూ పరిసరాల పరిశుభ్రత గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలని, చక్కటి ఆరోగ్యావంతమైన జీవన విధానాన్ని పాటించి, క్రమశిక్షణతో బాగా చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్వచ్ఛతాహీ సేవ పైన క్విజ్‌ను నిర్వహించి గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రవీందర్, అధ్యాపకులు నరేందర్, ప్రవీణ్, వెంకటరెడ్డి, కరుణాకర్, స్వరూప రాణి, నరేష్, భరత్ రెడ్డి, జయపాల్ తదిరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


ములుగు రూరల్: మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ శిరీష


వెంకటాపురం(కె): మాట్లాడుతున్న సీడీపీఓ ముత్తమ్మ

ములుగు రూరల్: పౌష్టికాహారంతోనే బాలింతలు, గర్భిణులు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ శిరీష అన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని జంగాలపల్లి–3 అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షల అవశ్యకత, కాల్షియం, ఐఎఫ్ఏ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, కామరున్నిసాబేగం, ఏఎన్ఎం రమ, శ్రీలత, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యం

వెంకటాపురం(కె): సమతుల్య ఆహారంతోనే చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ ముత్తమ్మ అన్నారు. శనివారం మండలంలోని వీరభద్రవరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, చిన్నారులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆకు కూరలు, చిరుధాన్యాలు, గుడ్లు, పాలు, పప్పులు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. బరువు తక్కువగల పిల్లలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ, తదితరులు ఉన్నారు.

నిందితుడిని ఉరితీయాలని రాస్తారోకో..


రాస్తారోకో చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

ఏటూరునాగారం: ఆదివాసీ మహిళపై అత్యాచారం, హత్యాయత్నం చేసిన నిందితుడు షేక్ ముక్‌దాన్ని ఉరితీయాలని తుడుందెబ్బ నాయకులు పొడెం బాబు, ఆదివాసీ విద్యార్థి సంఘం కొర్నిబెల్లి గణేష్, కోటేష్‌లు, ఆలం కిషోర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో తుడుందెబ్బ నాయకులు 163 జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి అనంతరం ఏఎస్పీకి వినతిపత్రం అందజేశారు. జైనూర్ పట్టణ కేంద్రంలో ఇప్పటి వరకు 72 మంది ఆదివాసీ మహిళలు ముస్లింల చేతిలో అక్రమంగా బందీలుగా ఉన్నారని ఆరోపించారు. నీలాబాయి ఆరోగ్యం, రక్షణ, ఉపాధి బాధ్యతలు ప్రభుత్వం తీసుకోవాలన్నారు. ఆ కార్యక్రమంలో మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు


ఆట ఆడుతున్న విద్యార్థులు, సిబ్బంది

వాజేడు: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ముర్మూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రగళ్లపల్లి, గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయతీల్లో ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, తాడుగుంజడం, ముగ్గుల పోటీ లు, బస్తా ఆటల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు కార్యదర్శులు అశోక్, కార్తీక్ బహుమతులు అందించారు.

సమస్యలు పరిష్కరించాలి

ఏటూరునాగారం: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ సభ్యుడు అశోక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ట్రైబల్ వెల్ఫేర్ బాలుర పాఠశాలలోని విద్యార్థుల సమస్యలను ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. విద్యార్థులు క్లాస్‌లు జరిగే సమయంలో ఆడవిడుపుగా పక్కనే ఉన్న పల్లెప్రకృతి వనంలోకి బయటకు వెళ్లడం బాధాకరం అన్నారు. విద్యార్థులకు ఏం జరిగినా ప్రిన్సిపాల్ బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో రవి, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న మల్లయ్య

వాజేడు: నో బ్యాగ్ డే సందర్భంగా మూడవ శనివారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులను గ్యాస్ గోదాం క్షేత్ర పర్యటనకు తీసుకెళ్లారు. హెచ్ఎం సోయం ఆనందరావు ఆధ్వర్యంలో ఎల్పీజీ గ్యాస్ వినియోగం, నిల్వ చేసే పద్ధతులు, గ్యాస్ ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా వినియోగదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు, ఆంగ్ల ఉపాధ్యాయుడు చల్లగురుగుల మల్లయ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భారత్ గ్యాస్ నిర్వాహకుడు కొండ్ర అభిషేక్, ఉపాధ్యాయులు స్వరూప్‌సింగ్, ఆనంద్, రవికుమార్, శ్రీకాంత్, కుమార్‌బాబు, ప్రభాకర్, రాజ్యలక్ష్మీ, రాజేష్, వస్య తదితరులు పాల్గొన్నారు.

పక్కా ఇల్లు మంజూరు చేయాలి


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జంపయ్య

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఆకులవారి ఘణపురం ప్రాంతానికి చెందిన కంకణాల గీతిక ఇటీవల మృతి చెందిందని ఆ పేద కుటుంబానికి పక్కా ఇల్లు మంజూరు చేయాలని జిల్లా బీఆర్ఎస్ నాయకుడు భూక్య జంపయ్య డిమాండ్ చేశారు. శనివారం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పక్కా ఇల్లుతో పాటు ఉపాధి కల్పించాలన్నారు. రాజు, పాషా, సాగర్, మహేందర్, హేమంత్, కిషోర్, సాగర్, రవి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం


గుమ్మడిదొడ్డిలో తెగిపడిన విద్యుత్ వైర్లు


వాజేడు: ఉధృతంగా వీచిన గాలికి మండలంలో పలుచోట్ల శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వెంకటాపురం(కె) మండలం నుంచి వాజేడు మండలానికి వచ్చే 33/11 కేవీ విద్యుత్‌లైన్ పలు ప్రదేశాల్లో మరమ్మతులకు గురైంది. మండల పరిధిలోని గుమ్మడిదొడ్డిలో ఎండిపోయిన చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో వైర్లు తెగిపడ్డాయి. తీగలను జేఎల్ఎం రాజేందర్, గ్రామస్తులు, సిబ్బందితో కలిసి మరమ్మతు పనులు చేపట్టారు. వెంకటాపురం(కె) నుంచి వచ్చే ప్రధాన లైన్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యలను ఏఈ అర్షద్ అహ్మద్, జేఎల్ఎం వంశీ పరిశీలిస్తున్నారు. సమస్యను గుర్తించి విద్యుత్ అంతరాయం కలగకుండా పునరుద్ధరిస్తామని ఏఈ తెలిపారు.

వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

వెంకటాపురం(ఎం): సీజనల్ వ్యాధులపై గొత్తికోయలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ చందన సూచించారు. శనివారం మండలంలో నారాయణపూర్ పరిధిలో గల బండ్లపహాడ్ వెంకటాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది గొత్తికోయగూడెంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 52మంది గొత్తికోయలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులను అందించారు. గర్భిణులకు, చిన్న పిల్లలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, ఏఎన్ఎం శోభారాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన చెట్టు


రోడ్డుపై కూలిన చెట్టు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శివాలయం వీధిలో శనివారం కురిసిన గాలి వాన బీభత్సానికి చెట్టుక కూలింది. రోడ్డుపై కూలడంతో రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ప డుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కూలిన చెట్టును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెల మృతి


మృతి చెందిన గొర్రెలు

మంగపేట: మండలంలోని కోమటిపల్లిలోని ఎస్ఎస్‌వన్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అదే గ్రామానికి చెందిన ననుబాల సోమయ్యకు చెందిన రెండు గొర్రెలు విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాయి. ట్రాన్స్‌కో అధికారుల పూర్తి నిర్లక్ష్యం కారణంగా రెండు గొర్రెలు మృతి చెందడంతో రూ.30 వేల నష్టం సంభవించిందని బాధితుడు సోమయ్య వాపోయాడు. గతంలో ఇదే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ వైర్‌కు కరెంటు సరఫరా కావడంతో మేతకు వెళ్లిన బుర్గుల నాగయ్య, పులి వెంకటయ్యకు చెందిన రెండు పాడి గేదెలు మృతి చెందాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని ప్రధాన రోడ్డు పక్కన్నే ఉన్న ట్రాన్స్ ఫార్మర్ ఎర్త్ వైర్‌కు కరెంటు సరఫరా అవుతున్నా సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం కారణంగా ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. జరిగిన సంఘటనకు ట్రాన్స్‌కో అధికారులు పూర్తి బాధ్యత వహించి నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

వాహనాల తనిఖీ


కారును తనిఖీ చేస్తున్న ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం: మండలంలోని వివిధ గ్రామాల కూడలి, మండల కేంద్రంలో ఎస్సై తాజొద్దీన్ శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ముందుజాగ్రత్తలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తనిఖీలను ముమ్మరం చేశారు. వాహనాల్లో ప్రయాణించేవారి వివరాలను సేకరించారు. 163 జాతీయ వెంట ఛత్తీస్‌గఢ్ వెళ్లే వాహనాలపై నజర్ వేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలకు టాప్ నంబర్ల కేటాయింపు


ఆటోకు టాప్ నంబర్ వేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు

ములుగు రూరల్: మండలంలోని ఆటోలు, టాటా మ్యాజిక్‌లు, జీపులకు టాప్ నెంబర్లను శనివారం ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోలలో ప్రయాణిస్తున్న క్రమంలో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన, రోడ్డు ప్రమాద సమయాలలో తప్పించుకునే ప్రయత్నం చేసిన టాప్ నంబర్లు ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. మండలంలో మొత్తం 193 ఆటోలు, 29 టాటా మ్యాజిక్‌లు, 3 జీపులు ఉన్నాయని అన్నారు. టాప్ నంబర్‌లు పొందని వారు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తీసుకోవాలని అన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ


విరాళం అందిస్తున్న డాక్టర్ పోరిక రవీందర్

ములుగు: ఖమ్మం వరద బాధితులకు తమవంతు సాయం అందించడానికి జిల్లా నిరుద్యోగ కళాకారులు శనివారం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సాటి కళాకారుడిగా స్పందించిన డాక్టర్ పోరిక రవీందర్ తనవంతు విరాళాన్ని అందించి ప్రారంభించారు. వ్యాపారులు, చిరువ్యాపారులు, తెలిసిన ఉద్యోగుల వద్ద నుంచి విరాళాలను సేకరించినట్లు నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోతె రాజు తెలిపారు. త్వరలో బాధితులకు సాయం అందిస్తామని అన్నారు. జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు గోల్కొండ బుచ్చన్న, సారథి కళాకారుల సంఘం అధ్యక్షుడు రాగుల శంకర్, యాకయ్య, సాంబన్న, ఉపేందర్, మల్లయ్య, రాజేందర్, పత్తిపల్లి రాజేందర్, రవీందర్, స్రవంతి, సరిత, కళావెలుగు అరవింద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్


ఆర్థిక సాయం అందజేస్తున్న బొల్లు దేవేందర్

ఎస్ఎస్‌తాడ్వాయి: పేదలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. మండలంలోని బంధాల గ్రామపంచాయితీ పరిధిలోని అల్లిగూడెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గుమ్మడి పాపయ్య కుటుంబాన్ని మేడారం జాతర చైర్మన్ అర్రెం లచ్చుపటేల్, నాయకులతో కలిసి శనివారం పరామర్శించి రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట సింగిల్‌విండో డైరెక్టర్ యానాల సిద్దిరెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు మంకిడి ప్రశాంత్, నాయకులు గుమ్మడి మల్లేష్, రామారావు, ముత్తయ్య, పాయం నర్సింగరావు , చేల నాగేశ్వర్‌రావు, ఆగబోయిన రామయ్య ఉన్నారు.

చెరువు, కుంటల కబ్జాపై అధికారుల సర్వే

సాక్షి ఎఫెక్ట్..

మంగపేట : మండలంలో అన్యాక్రాంతమైన చెరువులు, కుంటల శిఖం భూముల లెక్కలు తేల్చేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఎట్టకేలకు సర్వే నిర్వహించేందుకు ముందుకు కదిలారు. మండలంలోని చెరువులు, కుంటలకు చెందిన వందలాది ఎకరాల శిఖం భూములు కబ్జాకు గురికాగా, కొన్ని చెరువులు, కుంటలు ఆనవాళ్లు లేకుండా పోయిన విషయంపై ఈనెల 19న 'చెరువులు, కుంటలు మాయం' కథనం ద్వారా 'సాక్షి' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర స్పందించి ఎన్ని చెరువులు, కుంటల్లో ఎంత మేరకు శిఖం భూమి కబ్జాకు గురైంది, ఎన్ని మాయం అయ్యాయనే వాటి ప్రస్తుత పరిస్థితులపై పూర్తి వివరాలతో కూడిన నివేదికను అందించాలని సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కబ్జా లెక్కలు తేల్చి కలెక్టర్‌కు నివేదిక అందించే పనిలో నిమగ్నమయ్యారు. దీనిలో బాగంగా ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు ఉమ్మడిగా కబ్జాపై ప్రాథమిక అంచనా నివేదికను తయారు చేస్తున్నారు. బోరునర్సాపురం ఉప్పలనర్సయ్య చెరువులో 70 ఎకరాలు, మల్లూరు అత్తచెరువులో 80, కోడలు చెరువులో 70 ఎకరాలకు పైగా శిఖం భూములు కబ్జాకు గురికావడంతో మిగిలిన 82 చెరువుల్లో 23 నుంచి 50 ఎకరాలకు పైగా కబ్జాకు గురైనట్లు ప్రాథమిక అంచనా నివేదికను తయారు చేసినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందచేయనునట్లు సమాచారం. ప్రత్యేక కథనం రాసినందుకు ఆయకట్టు రైతులు 'సాక్షి'కి ప్రత్యేకంగా ఫోన్‌చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ తహసీల్దార్‌ను వివరణ అడుగగా కలెక్టర్ ఆదేశాల మేరకు చెరువుల కబ్జాపై ప్రస్తుతం పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించే అవకాశం లేక పోవడంతో ప్రాథమికంగా అంచనా నివేదికను తయారు చేసే పనిలో ఉన్నామన్నారు.

మహోన్నత వ్యక్తి లక్ష్మణ్‌బాపూజీ


కాటారం: నివాళులర్పిస్తున్న నాయకులు

కాటారం: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తన మంత్రి పదవిని సైతం వదిలేసిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్‌బాపూజీ అని పలువురు కొనియాడారు. తెలంగాణ ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతిని శనివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో పద్మశాలి సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. బాపూజీ విగ్రహా నికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చిట్యాల: మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్ల య్య ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని శనివారం నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏవైఎస్ నాయకులు రాజేందర్, జన్నే యుగేందర్, తిరుపతి, కిషన్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్లలో..

మండలకేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని చేనేత సహకార సంఘాల నాయకులు, చేనేత కార్మికులు, పద్మశాలి సంఘం, కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమావేసి నివాళులర్పించారు.

భూపాలపల్లి రూరల్: కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని హెచ్ఎంఆర్డీఎస్ దివ్యాంగ పాఠశాలలో పద్మశాలీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పద్మశాలీ జిల్లా అధ్యక్షుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాపూజీ తొలి, మలితరం తెలంగాణ ఉద్యమాల్లో ముందుండి నడిపించారన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, భాగవతం భిక్షపతి, ప్రభాకర్, కృష్ణమోహన్,సామల శ్రీనివాస్ ఉన్నారు.